

అధికారుల నిరసన

సస్పెండైన ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలని అధికారులు నిరసన తెలిపారు. 8లో ▸



పక్కా భవనాలు

ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మిచేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 8లో ▸



బస్సుల కోసం..

బస్సుల కోసం విద్యార్థులు రోడ్డెక్కారు. చేవెళ్ల మండలకేంద్రంలో గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

నేడు చందన చెరువు కట్టపై కొండా లక్ష్మణ్ విగ్రహావిష్కరణ

మీర్‌పేట: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం మీర్‌పేట చందన చెరువు కట్టపై గాయత్రీనగర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు మాకం సుధాకర్‌నేత, సలహాదారు గాజుల మధు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

ఎన్నో సమస్యలకు యోగాతో పరిష్కారం

విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా



అజయ్ మిశ్రాను సత్కరిస్తున్న ఐఎంసీటీఎఫ్ ప్రతినిధులు

హుడాకాంప్లెక్స్: భారతీయ సంస్కృతిలో యోగా శాస్త్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో గురువారం ఐఎంసీటీఎఫ్ నిర్వహించిన యోగాధాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపగల సత్తా భారతీయ యోగా శాస్త్రానికి ఉందన్నారు. నేటి విద్యార్థులు, యువత ఒత్తిడికిలోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, కార్పొరేట్ స్థాయిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు విపరీతమైన పని ఒత్తిడితో అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఎన్నో సమస్యలకు ఏకైక పరిష్కారం యోగాభ్యాసమేనని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. అందుకే ప్రధాని జూన్ 21న ఇంటర్నేషనల్ యోగాడేగా నిర్ణయించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐఎంసీటీఎఫ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, క్యాదర్శి రామ్మూర్తి, సంయుక్త కార్యదర్శి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు శుభవార్త

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పరీక్ష రాసి, పదహారేళ్లుగా పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్న డీఎస్సీ–2008 అభ్యర్థులకు శుభవార్త. అర్హులైన ఆయా అభ్యర్థులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా వారి సమస్యను పరిష్కరించడంతో పాటు అభ్యర్థులకు కొంత వరకు న్యాయం చేకూర్చవచ్చని భావించింది. ఈ మేరకు ఉమ్మడిజిల్లా పరిధిలోని (మేడ్చల్, వికారాబాద్, రంగారెడ్డి) అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు తేదీలకు సైతం ప్రకటించింది. శుక్రవారం నుంచి అక్టోబర్ 5వతేదీ వరకు కలెక్టరేట్‌లోని విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఆయా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించేందుకు ఏర్పాట్లు చేసింది. వీరిలో అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ అవకాశం కల్పించనుంది. ఇప్పటికే ఆయా అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. జీతభత్యాల చెల్లింపు, సర్వీసు రూల్స్, ఇతర అంశాలపై మంత్రి వర్గ ఉప సంఘం ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పూర్తిస్థాయి విధివిధానాలు రూపొందించిన తర్వాత వీరికి నియామక పత్రాలు అందజేయనుంది.

15,764 పంపు సెట్లు.. రూ. 1,332 కోట్లు

వ్యవసాయ కనెక్షన్ల జారీకి డిస్కం గ్రీన్‌సిగ్నల్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఉమ్మడి జిల్లా రైతులకు శుభవార్త. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని తొమ్మిది మండలాల పరిధిలో కొత్తగా 15,764 వ్యవసాయ పంపు సెట్లకు కనెక్షన్లు జారీ చేసేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆమోదం తెలిపింది. అంతే కాదు పంపిణీ వ్యవస్థ బలోపేతం కోసం అవసరమైన బడ్జెట్‌ను కేటాయించింది. రూ.1,332 కోట్ల ఖర్చుతో 25 కేవీఏ అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, హెచ్‌టీ లైన్లు, ఏబీ కేబుళ్లను ఏర్పాటు చేయనుంది. రాజేంద్రనగర్, వికారాబాద్, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని కొత్తూరు, షాద్‌నగర్, కందుకూరు, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, పరిగి, తాండూరు, వికారాబాద్, షాద్‌నగర్ రూరల్ మండలాల పరిధిలో సరఫరా వ్యవస్థను బలోపేతం చేయనుంది. విద్యుత్ సదుపాయం లేని చోట కొత్త లైన్లు వేయడంతో పాటు ఉన్న చోట హెచ్చుతగ్గుల సమస్య లేకుండా అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయనుంది.

8 జోన్లుగా ఫ్యూచర్ సిటీ!


- లైఫ్‌సైన్స్, స్పోర్ట్స్, ఎడ్యుకేషన్, హెల్త్ జోన్లుగా విభజన
- ఆఫీసులు, నివాసాలు, వాణిజ్య సముదాయాలన్నీ ఇక్కడే..
- దేశంలోనే తొలి నెట్‌జీరో సిటీగా తీర్చిదిద్దాలని సీఎం సంకల్పం

14 వేలకుపైగా ఎకరాల్లో ఏర్పాటుకు ప్లాన్

సాక్షి, రంగారెడ్డి జిల్లా : హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో వాటి సరసన కొత్తగా నాలుగో నగరం 'ఫ్యూచర్ సిటీ'పేరిట రూపుదిద్దు కోనుంది. దానిని ప్రణాళికాబద్ధంగా, ఆధునిక రీతిలో, కాలుష్యరహితంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కర్బన ఉద్గారాలు లేకుండా దేశంలోనే తొలి నెట్‌జీరో సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పించారు. హైదరాబాద్‌కు దక్షిణ భాగంలో 14 వేలకుపైగా ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ రూపుదిద్దు కోనుంది.

కొత్త సిటీలు అనివార్యమే..

పట్టణీకరణ, వలసలు, కాస్మోపాలిటన్ కల్చర్, మెరుగైన విద్యా, ఉద్యోగ, వైద్య అవసరాలు.. ఇలా అనేక కారణాలతో నగర జీవనానికి ప్రాధాన్యం పెరిగింది. 1951లో 17 శాతంగా ఉన్న పట్టణ జనాభా ఇప్పుడు 35 శాతానికి చేరింది. ఈ మధ్య కాలంలో ఎలాంటి ప్రణాళికలు లేకుండా నగరాలు, పట్టణాల విస్తరణ జరిగింది. దీంతో పట్టణాలు, నగరాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన క్లిష్టంగా మారింది. కాలుష్యం, ట్రాఫిక్ వంటి సమస్యలు తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా దీర్ఘకాలిక దృష్టితో కొత్త నగరాలను తీర్చిదిద్దడం, అభివృద్ధి చేయడం తప్పనిసరిగా మారింది. అయితే నిధులు, భూమి లభ్యత, రాజకీయ అనిశ్చిత పరిస్థితులు వంటివి కొత్త సిటీల అభివృద్ధికి సవాళ్లుగా మారుతున్నాయి. మెరుగైన ప్రయాణ సదుపాయాలు, ఇతర నగరాలతో కనెక్టివిటీ, స్థిరమైన జీవన ప్రమాణాలు, విస్తృత ఆర్థిక, సామాజిక, ఉద్యోగ అవకాశాలు, సరసమైన గృహాలతో గ్రీన్‌ఫీల్డ్ నగరాలను నిర్మించడం ఉత్తమం. కొత్త నగరాలు స్థానిక అవసరాలకే కాకుండా అంతర్జాతీయ ఆర్థిక, పర్యాటక ఆకర్షణగా నిలిస్తేనే విజయవంతం అవుతా యని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



వాటికి భూ కేటాయింపులు

గతంలో ఫార్మాసిటీగా ప్రతిపాదించిన ముచ్చెర్ల, మీర్‌ఖాన్‌పేట వంటి పది గ్రామాలు ఫ్యూచర్ సిటీలో భాగం కానున్నాయి. ఈ నాలుగో నగరంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, లైఫ్ సైన్స్ హబ్, హెల్త్ సిటీ, స్పోర్ట్స్ హబ్, ఎలక్ట్రానిక్ అండ్ అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎడ్యుకేషన్ అండ్ యూనివర్సిటీ, రెసిడెన్షియల్, మిక్స్‌డ్ అండ్ ఎంటర్టైన్‌మెంట్ జోన్లు ఉంటాయి. భవిష్యత్తు నగరిలో సింహభాగం మేర భూమిని లైఫ్ సైన్సెస్ హబ్, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లకే కేటాయించారు. లైఫ్ సైన్సెస్ హబ్‌కు 4,207, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు 3,642 ఎకరాలను కేటాయించినట్లు సమాచారం.

ఎయిర్, మెట్రో, రోడ్డు సదుపాయాలు

ఫ్యూచర్ సిటీకి విమానయానం, మెట్రో, రోడ్డు వంటి అన్ని రకాల రవాణా సదుపాయాలతో అనుసంధానమై ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా శంషాబాద్ విమానాశ్రయం, ఓఆర్ఆర్, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రైల్ కనెక్టివిటీతో ఫ్యూచర్ సిటీకి రోడ్లు నిర్మించనున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

- 140 ఎకరాల ఏఐ సిటీలో ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ హబ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ వంటివి ఉంటాయి.
- మీర్‌ఖాన్‌పేటలో 255 ఎకరాలను ఎడ్యుకేషన్ అండ్ యూనివర్సిటీ జోన్‌కు కేటాయించారు. ఇందులో ఇప్పటికే నైపుణ్య విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.
- 258 ఎకరాలను స్పోర్ట్స్ హబ్‌కు కేటాయించారు. ఇందులో స్పోర్ట్స్ అకాడమీ, మల్టీపర్పస్ స్టేడియం, క్లబ్ హౌస్ వంటివి నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది.
- హెల్త్ సిటీకి 116 ఎకరాలు కేటాయించగా, మెడికల్ టూరిజంను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పాలసీని తీసుకురానుంది. ఇందులో ప్రపంచ స్థాయి ప్రయోగశాలలు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) జోన్‌లు, వ్యాపార కేంద్రాలుంటాయి.
- ఆయా జోన్లలో పనిచేసే వారికి నివాసాల కోసం 1,170 ఎకరాలను కేటాయించింది.
- మల్టీప్లెక్స్‌లు, పార్కులు, హోటళ్లు, వినోద కేంద్రాల కోసం 336 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది.

ట్రిలియన్ ఎకానమీ.. పదేళ్ల లక్ష్యం

రాయదుర్గం: రాష్ట్రంలో వచ్చే దశాబ్ద కాలంలో ఒక ట్రిలియన్ ఎకానమీ సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఐఎస్ఎఫ్–2024 సదస్సులో పాల్గొన్నారు. ఎస్కీలో నూతనంగా నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అందరి సహకారంతో లక్ష్యాల సాధన దిశగా ముందుకుసాగాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని గ్లోబల్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)కు రాజధానిగా మార్చాలని సంకల్పించినట్లు చెప్పారు. అందులో భాగంగా ఏఐ నగరాన్ని నిర్మాణం చేసేందుకు ఇప్పటికే చర్యలు ఆరంభించినట్లు తెలిపారు. ఈ తరుణంలో అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్‌ను నగరంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామి కావాలని కోరుకుంటోందని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు, ఐటీ దిగ్గజాలు బీవీఆర్‌మోహన్‌రెడ్డి, జేఏచౌదరి, రంగనాథ్, శ్రీనిరాజు, గుప్త వి.భానుప్రకాశ్‌రెడ్డి, అచ్యుత్, సత్యేంద్రకుమార్, శివమహేశ్‌తోపాటు పలు ఐటీ సంస్థలు, హైసియా ప్రతినిధులు, స్టార్టప్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

30 జూనికారన్స్‌కు ప్రోత్సాహం

ఐఎస్ఎఫ్–2024లో భాగంగా 30 జూనికరన్స్ (పాఠశాల, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు) రూపొందించిన నూతన ఆవిష్కరణలకు చోటు లభించింది. 200కుపైగా ఎంపిక చేసిన స్టార్టప్‌లతో మహోన్నత ఆవిష్కరణలకు ఐఎస్ఎఫ్ ఎక్స్‌పోలో ప్రదర్శించేందుకు అవకాశం లభించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

హామీలు మరిచి హైడ్రా పేరుతో హల్‌చల్

- వాగ్దానాల అమలులో కాంగ్రెస్ విఫలం
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



రాయికల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో హల్‌చల్ చేస్తోందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్, అన్నారం గ్రామాలతో పాటు షాద్‌నగర్ పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. అధికారం చేపట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్య పెట్టిందని, ప్రజలకు ఎన్నో ఉచిత హామీలు ఇచ్చిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రూ.2లక్షల అప్పును ఏకకాలంలో మాఫీ చేస్తామని చెప్పి చేయలేదని, దీంతో వారు అధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిపారు. రుణాలు పొందిన రైతులకు బ్యాంకర్లు నోటీసులు జారీ చేస్తున్నారని గుర్తు చేశారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం చేపడుతున్న కూల్చివేతలతో ప్రజల్లో భయాందోళనలు నెలకొంటున్నాయని అన్నారు. కేంద్రంలో మోదీ సర్కార్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, తద్వార పార్టీ సంస్థాగతంగా బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, జిల్లా సభ్యత్వ నమోదు ప్రముఖ్ కందూరి మనోహర్‌రెడ్డి, నాయకులు కక్కునూరి వెంకటేష్‌గుప్తా, అమదాపురం నర్సింహాగౌడ్, ఇస్నాతి శ్రీనివాస్, వంశీకృష్ణ, విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ మండలం నాగర్‌గూడ గ్రామ పంచాయతీ కార్యాలయం

సర్వత్రా 'స్థానిక' చర్చ

- పంచాయతీల్లో హాట్ టాపిక్
- ఎన్నికలపై స్పష్టత ఇవ్వని సర్కార్
- రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఆందోళన
- మరోవైపు ఓటరు జాబితాపై ఎన్నికల సంఘం కసరత్తు

షాబాద్: పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో.. పాత రిజర్వేషన్లే కొనసాగిస్తారా.. కొత్త విధానం అవలంబిస్తారా.. ఈసారి ఎవరెవరు పోటీ చేస్తారో.. ఇలా గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇదే చర్చ నడుస్తోంది. పంచాయతీ పదవులపై కన్నేసిన ఆశావహులు రిజర్వేషన్ కలిసి వస్తుందా లేదా అని.. వర్తించకపోతే ఏం చేయాలా అని తర్జనభర్జన పడుతున్నారు. మరికొందరు ఆసక్తిగల నేతలు తమ అనుచరగణంతో ఎన్నికలపై సమాలోచనలు చేస్తున్నారు. మాజీ ప్రజాప్రతినిధులు తమ హయాంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లుల కోసం పోరాడుతూ.. మరోవైపు వచ్చే ఎన్నికల్లో తమ ఉనికి చాటుకునేందుకు అవసరమైన వ్యూహాలు రచిస్తున్నారు.

రిజర్వేషన్లు ఎలా ఉంటాయో..?

బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లు పదేళ్ల పాటు అమల్లో ఉండేలా గత ఎన్నికల సమయంలోనే చట్టం రూపొందించింది. ఆ చట్టం ప్రకారం పాత రిజర్వేషన్లనే కొనసాగించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని సర్కార్ కొత్త విధానం అమలు చేసి తన మార్కు చూపెట్టుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అదే జరిగితే పాత రిజర్వేషన్ల చట్టాన్ని రద్దు చేసి కొత్తది రూపొందించాల్సి ఉంటుందని, అందుకు ఏ పద్ధతులను అమలు చేస్తారోననే ఉత్కంఠ నేతల్లో నెలకొంది. రిజర్వేషన్ల అమలు, పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది.

ఓటరు జాబితా తయారీ

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండేలా ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. దీంతో అధికార యంత్రాంగం ఓటరు జాబితా తయారీలో నిమగ్నమైంది. ఒకే కుటుంబానికి చెందిన వారంతా ఒకే పోలింగ్ బూత్‌లో ఓటుహక్కు వినియోగించుకునేలా చూడడంతోపాటు ఈనెల 13న ఫొటో ఓటరు జాబితా ప్రచురించింది. 14 నుంచి 21వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించింది. ఓటరు జాబితాపై అభిప్రాయసేకరణ కోసం జిల్లాస్థాయి రాజకీయ నాయకులతో సమావేశాలు నిర్వహించింది. జిల్లా పంచాయతీ అధికారి ఈనెల 26న అభ్యంతరాలు పరిష్కరించారు. పంచాయతీల వారీగా తుదిఓటరు జాబితాను ఈనెల 28న ప్రచురించనున్నారు.

ముంచెత్తిన వరద

- ట్రంక్‌లైన్ ఓవర్‌ఫ్లోతో ప్రవాహం
- కాలనీలను చుట్టేసిన వరద నీరు
- ఇళ్లలోకి చేరి జనం ఇక్కట్లు
- పాడైపోయిన ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు



మిథులానగర్ కాలనీలోకి చేరిన వరదనీరు

మీర్‌పేట: వరదనీరు కార్పొరేషన్ పరిధిలోని మిథులానగర్, సత్యసాయినగర్ కాలనీలను ముంచెత్తింది. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో బడంగ్‌పేట ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వరదనీరు మీర్‌పేట పెద్ద చెరువు, మంత్రాల చెరువు ద్వారా ట్రంక్‌లైన్‌లోకి వచ్చి చేరింది. వరదనీటి ప్రవాహం అధికమవడంతో మిథులానగర్ వద్ద ట్రంక్‌లైన్, మ్యాన్‌హోళ్లు తట్టుకోలేక ఓవర్‌ఫ్లో అయ్యాయి. దీనికి తోడు ట్రంక్‌లైన్‌లో ఇసుక, చెత్తాచెదారం చేరి జామ్ కావడంతో కాలనీలను ఒక్కసారిగా వరదనీరు చుట్టేసింది.

బయటకు రాలేని పరిస్థితి

వరదనీరు ఒక్కసారిగా ముంచెత్తడంతో ఆయా కాలనీలవాసులు భయాందోళనకు గురయ్యారు. గురువారం ఉదయం 11 గంటల వరకు కూడా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. నీరు మోకాలి లోతు వరకు వచ్చి చేరడంతో పాఠశాలలు, ఉద్యోగాలకు వెళ్లే వారు ఇళ్లకే పరిమితమయ్యారు. సత్యసాయినగర్ కాలనీలోని చాలా వరకు ఇళ్లలోకి నీరు చేరి ఫర్నిచర్, గృహోపకరణాలు పాడైపోయాయి. ఇటీవల ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదని మిథులానగర్‌వాసులు ఆరోపిస్తున్నారు.

డీఆర్ఎఫ్ బృందంతో తొలగింపు

కార్పొరేషన్ అధికారులు డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించి కాలనీల్లో నిలిచిన వరదనీటి తొలగింపు చర్యలు చేపట్టారు. సిబ్బంది రంగంలోకి దిగి ఆరు గంటల పాటు మ్యాన్‌హోళ్లకు అడ్డంగా ఉన్న ఇసుక, మట్టిని తొలగించడంతో వరదనీరు దిగువకు వెళ్లిపోయింది. వరదనీటి ప్రవాహం అధికంగా ఉండడం.. ట్రంక్‌లైన్ మార్గంలో జామ్ కావడంతో సమస్య తలెత్తిందని మీర్‌పేట కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. చెత్తా చెదారాన్ని తొలగించామని, ప్రస్తుతం నీరు సాఫీగా వెళ్తోందని చెప్పారు.



సత్యసాయినగర్ కాలనీలోని ఓ ఇంట్లోకి చేరిన వరద నీరు



మిథులానగర్ వద్ద ట్రంక్‌లైన్ ఓవర్‌ఫ్లో అయిన ప్రదేశంలో ఇసుక బస్తాలు వేస్తున్న సిబ్బంది

ప్రభుత్వం ఆదుకోవాలి



మోకాలి లోతు వరకు నీరు ఇంట్లోకి వచ్చి చేరడంతో రాత్రంతా నిద్ర లేదు. షార్ట్ సర్క్యూట్‌తో టీవీ, ఫ్రిజ్, ఫర్నిచర్ పూర్తిగా పాడైపోయాయి. దీపావళి పండుగ సందర్భంగా విక్రయించేందుకు తెచ్చిన లక్ష రూపాయలకు పైగా టపాసులు నీట మునిగాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఆకాష్ ఠాకూర్, సత్యసాయినగర్

తుక్కుగూడ చైర్‌పర్సన్‌గా హేమలత

- హైకోర్టు తీర్పుతో అందివచ్చిన పదవి
- ఫలించిన నాలుగున్నరేళ్ల న్యాయపోరాటం

తుక్కుగూడ: మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బరిగెల హేమలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు తీర్పును అమలు చేస్తూ ఉన్నతాధికారులు ఆమెకు పదవిని కట్టబెట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తుక్కుగూడ పురపాలక సంఘానికి 2020 జనవరిలో ఎన్నికలు నిర్వహించారు. 15 వార్డులకు గాను బీఆర్ఎస్–5, బీజేపీ 9, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు గెలుపొందారు. మున్సిపల్ చైర్మన్ పదవిని చేపట్టడానికి బీజేపీకి సంపూర్ణ మెజార్టీ ఉన్నప్పటికీ అది నెరవేరలేదు. 2020 జనవరి 27న జరిగిన చైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఐదుగురు కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫీషియో హోదాలో అప్పటి మంత్రి సబితారెడ్డి, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, ఎమ్మెల్సీలు నాయిని నర్సింహారెడ్డి, కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో బీఆర్ఎస్ తరఫున ఉన్న పది మంది సభ్యులు.. స్వతంత్ర అభ్యర్థి కాంటేకర్ మధుమోహన్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. తొమ్మిది మంది సభ్యులున్న బీజేపీ అభ్యర్థి బరిగెల హేమలత రెండో స్థానానికి పరిమితమయ్యారు.

ఎన్నికల ట్రిబ్యునల్ కోర్టులో కేసు

మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు అవసరమైన మెజార్టీ బీజేపీకి సంపూర్ణంగా ఉన్నప్పటికీ ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లతో బీఆర్ఎస్ దీన్ని అడ్డుకుంది. స్వతంత్ర అభ్యర్థిని తమ పార్టీలో కలుపుకొని చైర్మన్ పదవిని అప్పగించింది. ఈ విషయమై బీజేపీ నుంచి గెలుపొందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు 2020 ఫిబ్రవరిలో జిల్లా ఎన్నికల ట్రిబ్యునల్ కోర్టులో కేసు వేశారు. ఎక్స్ అఫీషియో ఓట్లు చెల్లవని, గతంలో జరిగిన చైర్మన్ ఎన్నికను రద్దు చేసి, మున్సిపల్ సభ్యులతో కొత్త చైర్మన్‌ను ఎన్నుకోవాలని 2022 డిసెంబర్ 12న ట్రిబ్యునల్ కోర్టు తీర్పు వెల్లడించింది. దీనిపై సంతృప్తి చెందని బీజేపీ కౌన్సిలర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో రెండో స్థానంలో నిలిచిన బరిగెల హేమలతకు చైర్‌పర్సన్ బాధ్యతలు అప్పగించాలని గత జూలై 19న హైకోర్టు తీర్పు వెల్లడించింది.

రెండు నెలల నిరీక్షణ

న్యాయస్థానం తీర్పు నేపథ్యంలో రెండు నెలల తర్వాత సీడీఎంఏ, జిల్లా ఎన్నికల సంఘం, కలెక్టర్ సంయుక్త ఆధ్వర్యంలో తుక్కుగూడ చైర్‌పర్సన్‌గా హేమలతకు బాధ్యతలు అప్పగించారు. కందుకూరు ఇన్‌చార్జ్ ఆర్డీఓ అనంతరెడ్డి మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, బీజేపీ నాయకులు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, మాజీ చైర్మన్ కె.మధుమోహన్, వైస్ చైర్మన్ భవాని, కౌన్సిలర్లు యాదగిరి రెడ్డి, అనిత, శివకుమార్, మౌనిక, పద్మ, విలాస్, భావన, రాజు, లావణ్య పాల్గొన్నారు.



మున్సిపల్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న నూతన చైర్‌పర్సన్ హేమలత

ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ పరిధి అన్ని మండలాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా, వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు కసిరెడ్డి సత్యనారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు కడ్తాలలో ఎంఎస్ఎస్ సెంటర్ నిర్మాణానికి, ఆమనగల్లులో పీఏసీఎస్ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.పీఏసీఎస్ భవనాల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ కడ్తాల్ అధ్యక్షుడు బిచ్యానాయక్ వినతిపత్రం అందించారు. ఇందుకు స్పందించిన ఆయన కడ్తాల్ మండల కేంద్రంలో పీఏసీఎస్ మల్టీ సర్వీసెస్ సెంటర్ నిర్మాణానికి 1.20 ఎకరాల భూమి కేటాయించామని వెంటనే భూమిని అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిన పనులను ప్రారంభిస్తామన్నారు. ఆమనగల్లు పట్టణంలో పీఏసీఎస్ భవనం నిర్మాణం కోసం అనువైన స్థలం గుర్తిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు జోగు వీరయ్య, చేగూరి వెంకటేశ్, వెంకటయ్య, రమేశ్, సీఈఓ దేవేందర్, సిబ్బంది పద్మాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, భీష్మాచారి తదితరులు ఉన్నారు.

స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను తరలించాలి

తీర్పు వెల్లడించిన హైకోర్టు

కేశంపేట: జనావాసాలకు దూరంగా స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను తరలించాలని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. షాద్‌నగర్ నియోజకవర్గంలో స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన సీనియర్ అడ్వకేట్ తాండ్ర వీరేందర్‌రెడ్డి 2005లో హైకోర్టు పిల్ దాఖలు చేశారు. కాగా హైకోర్టు చీఫ్ జస్టిస్ హాలోక్ అరధే, శ్రీనివాస్‌రావులతో కూడిన ప్రత్యేక బెంచ్ విచారణ చేపట్టింది. జనావాసాలకు దూరంగా స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను తరలించాలని ఈనెల 10న హైకోర్టు తీర్పు వెల్లడించినట్లు న్యాయవాది తాండ్ర వీరేందర్‌రెడ్డి గురువారం మీడియాకు తెలిపారు. రైతుల తరుపున పోరాటం చేసి కోర్టులో విజయం సాధించిన న్యాయవాది వీరేందర్‌రెడ్డిని పలువురు అభినందించారు.

బైక్‌పై అసభ్యంగా ప్రవర్తించిన జంట గుర్తింపు

పహాడీషరీఫ్: రెండు రోజుల క్రితం పహాడీషరీఫ్ ప్రధాన రహదారిలో బైక్‌పై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ప్రమాదపుటంచున బైక్‌ను నడిపిన యువజంటను బాలాపూర్ పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. కలకత్తాకు చెందిన మహ్మద్ వాసిఫ్ అర్షద్, అదే ప్రాంతానికి చెందిన యువతి గచ్చిబౌలిలో ప్రైవేట్ ఉద్యోగులు. ఈ నెల 24న స్నేహితులైన వీరిద్దరూ టీవీఎస్ అపాచీ బైక్‌పై అనుచితంగా ప్రవర్తిస్తూ వెళ్లడంతో వీడియో తీసిన ఇతర వాహనదారులు సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో బాలాపూర్ పోలీసులు న్యూసెన్స్ కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాలలో బైక్ నంబర్‌ను గుర్తించి యువతీ యువకులను గురువారం పోలీస్‌స్టేషన్‌కు రప్పించి.. హెచ్చరించి నోటీసులిచ్చి పంపించారు. కాగా వీరు ఆదిబట్లలో ఉన్న స్నేహితులను కలిసేందుకు వెళుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

బస్సుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు


బస్సుల సంఖ్య పెంచాలని రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

చేవెళ్ల: బస్సుల కోసం విద్యార్థులు రోడ్డెక్కారు. మండలకేంద్రంలో గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు, శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కల్లెం సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో ప్రజలు, విద్యార్థులను మోసం చేస్తోందని విమర్శించారు. గ్రామాలకు వచ్చే బస్సులు సరిగా రావడం లేదని, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా బస్సుల సంఖ్యను పెంచాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రోడ్డుపై విద్యార్థుల ఆందోళనతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మహిపాల్, హరికృష్ణ, శివ, కిషోర్, విజయ్, ప్రశాంత్, అనిల్, నితీష్, విష్ణు, హరికృష్ణ, పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ అధికారుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, అధికారులు

మొయినాబాద్ రూరల్: సస్పెండైన ఎంపీడీఓ, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలని మొయినాబాద్ మండల పంచాయతీ అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి సంధ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలోని గుర్రంపోడు ఎంపీడీఓ మంజుల, పెద్దపురం మండలం పుంచర్ల పంచాయతీ కార్యదర్శి నాగరాజు, దామరచెర్ల మండలం వాక్యాతండా జూనియర్ పంచాయతీ కార్యదర్శి స్వప్నను కలెక్టర్ సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టామన్నారు. పంచాయతీల్లో కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి ఇబ్బందికరంగా ఉన్న పరిస్థితుల్లో పంచాయతీలకు సంబంధించిన పరికరాలు, శానిటేషన్, కంపోస్టు, షెడ్డులను సక్రమంగా ఉంచలేదనే కారణాలతో సస్పెండ్ చేయడం సరికాదన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ రెహమాన్, సీనియర్ అసిస్టెంట్ కులశేఖర్, పంచాయతీ కార్యదర్శులు రంజిత్‌కుమార్, సురేందర్, సుదర్శన్, నరేష్, యాదగిరి, రజిత, తారాబాయి, వెంకటయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై లైంగికదాడికి యత్నం

షాద్‌నగర్‌రూరల్: మహిళపై అత్యాచార యత్నం చేసిన ఓ వ్యక్తి పై షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బల్‌రాం తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన గణేష్ గౌడ్ బుధవారం అర్ధరాత్రి అదే గ్రామానికి ఓ మహిళ ఇంట్లోకి చొరబడి లైంగిక దాడికి యత్నించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

అరుదైన వ్యాధితో బాధపడుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

సాక్షి, సిటీబ్యూరో: ఆపదలో ఉన్నవారిని ఎప్పుడూ ఆదుకునే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇప్పుడు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. ఆస్పత్రిలో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. దయార్థ హృదయుల స్పందన కోసం ఆశగా నిరీక్షిస్తున్నాడు. అతడి పేరు కృష్ణప్రసాద్(48). నగరంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగి. అతడు మెదడు, మూత్రపిండాలు వంటి ప్రధాన శరీరభాగాల్లో రక్తనాళాలు చిట్లిపోయే అరుదైన వ్యాధి(థ్రాంబోటిక్ మైక్రో ఆంజియోపతి)తో బాధపడుతున్నాడు. దీని చికిత్సకు ఏకంగా రూ.3 కోట్లు అవసరం పడుతోందని అతడి స్నేహితుడు బాలప్రసాద్ చెబుతున్నాడు. అమెరికా నుంచి ఎక్యులిజుమాబ్ అనే ఇంజెక్షన్లు తెప్పించాలని, వీటిని ఆరు నెలలపాటు ఇవ్వాల్సి వస్తుందని డాక్టర్లు చెబుతున్నారని తెలిపాడు. ఒక్కో ఇంజెక్షన్ ఖరీదు రూ.9 లక్షలు అవుతుందని, మొత్తం 24 ఇంజెక్షన్లు అవసరమని చెప్పాడు. అవసరాల్లో ఉన్నవారిని కృష్ణప్రసాద్ ఆదుకునేవాడని, ఇప్పుడు అతడే ప్రాణాపాయస్థితిలో ఉన్నాడని పేర్కొన్నాడు. కృష్ణప్రసాద్ తల్లి కూడా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని తెలిపాడు. అతడి భార్య ఏడాది కిందటే కన్నుమూసిందని చెప్పా డు. దాతలు ముందుకొచ్చి అకౌంట్ నంబర్: 91001004 2902046, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: UTIB 0000008, బేగంపేట యాక్సిస్ బ్యాంకు, హైదరాబాద్‌కు ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నాడు.

నెయ్యి కంపెనీపై దాడులు

మైలార్‌దేవ్‌పల్లి: అనుమతులు లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో వెన్న తయారీ కంపెనీపై ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాటేదాన్ పారిశ్రామిక వాడలో గత కొన్ని రోజులుగా శ్రవణ్ అనే వ్యక్తి తెలంగాణ ఫుడ్స్ పేరుతో వెన్నను తయారు చేస్తున్నాడు. అపరిశుభ్ర వాతావరణంలో ఎలాంటి నిబంధనలు పాటించకుండా రీప్యాకింగ్ చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌వోటీ పోలీసులు గుర్తించారు. ఈ మేరకు గురువారం కంపెనీపై పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. నిర్వాహకుడి నుంచి 280లీటర్ల బట్టర్, 21బ్యాగులు మిల్క్ పౌడర్, 25కేజీల మైదాపిండిని సీజ్ చేసి, వాటిని ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న నెయ్యి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నిర్వాహకుడు శ్రవణ్‌ను పోలీసులకు అప్పగించారు.


అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కంపెనీలో బట్టర్ డబ్బాలు

PUBLIC NOTICE

The General public is hereby informed that my client Aligati Indu Teja, W/o.Gaddam Kamalakar, aged about 41 years, Occ: Private Employee, R/o. Plot No.36. Raghavendra Nagar Colony, Near Gayathri Nagar, Meerpet Municipal Corporation, Balapur Mandal, Ranga Reddy District, Hyderabad-500097 (Cell No.8985888044) has entered into an agreement of Sale with Nanji Bhai Patel, S/o. Late.Karamshi Bhai Patel (seller) for purchase of Plot No.62, admeasuring 480 Sq. yards and Plot No.70, admeasuring 480 Sq. yards total admeasuring 960 Sq. yards or 802.65 Sq. Mtrs., in Sy. Nos. 105 and 106, situated at Torrur village, Hayathnagar Mandal, Ranga Reddy District and bounded by North; Plot Nos.63 & 69, South: 40' Wide Road, East: 30' Wide Road, West: 30' Wide Road, if any person having any objections, right, title, interest or claim, whatsoever in respect of the above said property may notify the same to me or to my above said client together with documentary proof within (7) days of publication of this notice. Any objections received thereafter shall neither be entertained nor binding on my clients who will proceed with the purchase of the said property.

Sd/- V. LINGASWAMY MBA LLB.
ADVOCATE
H.No.8-46, Plot No.92, Maitripuram Colony, Karmanghat, Saroornagar, R.R. District-500 079. Cell:9848389497
Hyderabad, Dt:26-09-2024

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ మోటివేషనల్ స్పీకర్‌గా జహీర్


జహీర్ ఆజాద్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రదీప్

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ మోటివేషనల్ స్పీకర్‌గా ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉపాధ్యాయుడు జహీర్ ఆజాద్ ఎంపికయ్యారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గంపా నాగేశ్వర్‌రావు స్థాపించిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. సికింద్రాబా ద్‌లోని మినర్వాగ్రాండ్‌లో రెండు రోజులుగా నిర్వహించిన ప్రజెంటేషన్ వర్క్‌షాప్ లో మోటివేషనల్ స్పీకర్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జహీర్ ఆజాద్‌కు సర్టిఫైడ్ మోటివేషనల్ స్పీకర్‌గా ధృవపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన సినీ నటుడు, రచయిత, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ కెవీ ప్రదీప్ చేతులు మీదుగా ప్రశంసాపత్రాన్ని స్వీకరించారు. ఆజాద్‌ను ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ శ్యామ్ రాథోడ్, ప్రముఖ స్పీకర్ సతీశ్, శ్రీనివాస్, వాడేకర్‌లు అభినందించారు.

గోల్డ్ ఫిష్ అడోబ్ ఎండీ చంద్రశేఖర్ అరెస్ట్

- కార్పస్ ఫండ్, మెయింటెనెన్స్ చార్జీల దుర్వినియోగం
- రూ.6.81 కోట్లు వ్యక్తిగత అవసరాలకు మళ్లింపు
- సైబరాబాద్ ఈఓడబ్ల్యూలో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్‌కు చెందాల్సిన కార్పస్ ఫండ్, మెయింటెనెన్స్ చార్జీలను దుర్వినియోగం చేసినందుకు గాను గోల్డ్ ఫిష్ అడోబ్ ఎండీ చంద్రశేఖర్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ)లో పోలీసులు గురువారం అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెల్లాపూర్‌కు చెందిన గోల్డ్ ఫిష్ అడోబ్ ప్రై.లి. ఎండీ చంద్రశేఖర్ వేగే, గండిపేటకు చెందిన క్రెస్టా విల్లాస్ ఓనర్స్ ఎంఎంఏసీఎస్ లిమిటెడ్‌తో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కం జనరల్ పవరాఫ్ అటార్నీ (జీపీఏ) ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే జీపీఏ నిబంధనలు ఉల్లంఘించి 2020–23 మధ్యకాలంలో తన డైరెక్టర్ల ద్వారా కార్పస్ ఫండ్, మెయింటెనెన్స్ చార్జీల రూపంలో విల్లా యజమానుల నుంచి సేకరించిన రూ.6.81 కోట్ల నిధులను చంద్రశేఖర్ దుర్వినియోగం చేశారు. ఆయా నిధులను క్రెస్టా విల్లాస్ ఓనర్స్‌కు బదిలీ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకున్నాడు. అంతేకాకుండా అగ్రిమెంట్‌లో వ్యక్తిగతంగా సంతకం చేసినప్పటికీ.. నిందితుడు తన అదనపు డైరెక్టర్ల ద్వారా క్రెస్టా గేటెడ్ కమ్యూనిటీలోని విల్లాలను రిజిస్ట్రేషన్ చేశారు. క్రెస్టా విల్లాస్ ఓనర్స్ ఎంఎంఏసీఎస్ లిమిటెడ్ సెక్రటరీ ఎస్ విక్రాంత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో చంద్రశేఖర్‌ను అరెస్టు చేశారు. నిందితుడిపై ఇప్పటికే నార్సింగి పీఎస్ పరిధిలో ఏడు క్రిమినల్ కేసులతో పాటు గచ్చిబౌలి పీఎస్‌లో పీడీ యాక్ట్ నమోదయ్యింది.

నిమ్స్ వైద్యుల కృషి అమోఘం

ఉచిత గుండె ఆపరేషన్లపై బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్


బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ ఓవెన్‌ను అభినందిస్తున్న నిమ్స్ డాక్టర్ అమరేష్

లక్డీకాపూల్: నిమ్స్ వైద్యుల కృషి ఆదర్శప్రాయంగా ఉందని బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. నాలుగు రోజులుగా బ్రిటన్ వైద్యులు డాక్టర్ దన్నపనేని రమణ, నిమ్స్ కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ ఎం.అమరేశ్వరరావు నేతృత్వంలో చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు 17 మంది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపారు. విషయం తెలుసుకున్న బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గురువారం నిమ్స్‌ను సందర్శించారు. చిన్నారులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. స్వంత గడ్డకు సేవ చేస్తున్నారంటూ డాక్టర్ రమణను అభినందించారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ మూడేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం, నిమ్స్ వైద్యులు డాక్టర్ అమరేశ్వర్‌రావు సహకారంతో గుండె ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. డాక్టర్ అమరేశ్వర్‌రావు మాట్లాడుతూ ఈ నెల 30 తేదీ వరకు జరిగే ఈ వైద్యశిబిరంలో 20 మందికి గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. మొత్తం 209 మంది గుండె జబ్బు బాధితులు పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. ముగ్గురికి గుండె మార్పిడి ఆపరేషన్లు చేయాల్సి ఉందని.. 40 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు గుర్తించా మని, వారికి త్వరితగతిన ఆపరేషన్లు చేయాల్సి ఉందని అన్నారు.

అడిషనల్ కమిషనర్లకు సీఆర్ఎంపీ బాధ్యతలు

- రహదారుల్లో ఎప్పటికప్పుడు లోపాలు గుర్తించాలి
- ఒప్పందం మేరకు పనులయ్యేలా చూడాలి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సమగ్ర రోడ్డు నిర్వహణ పథకం(సీఆర్ఎంపీ) బాధ్యతను అడిషనల్ కమిషనర్లకు జీహెచ్ఎంసీ అప్పగించింది. కాంట్రాక్టు ఏజెన్సీలకు ఐదేళ్ల నిర్వహణకుగాను రూ.1,800 కోట్లు చెల్లిస్తున్నప్పటికీ, వర్షాల సమయంలో అవి ప్రయాణానికి అనుకూలంగా ఉండటంలేవు. రోడ్లపై గుంతలు పడితే ఒప్పందం ప్రకారం ఇరవై నాలుగు గంటల్లోగా కాంట్రాక్టర్ పూడ్చివేయాలి. అయితే ఆ కాలవ్యవధిలో పనులు జరగడం లేవు. త్వరలోనే కాంట్రాక్టు ఏజెన్సీల గడువు కూడా ముగిసిపోనున్న నేపథ్యంలో సీఆర్ఎంపీ రోడ్లకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేయించుకోవాలనే కృతనిశ్చయంతో జీహెచ్ఎంసీ ఉంది. తప్పుడు లెక్కలు చూపే అధికారులపైనా చర్యలుంటాయని ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించిన విషయం తెలిసిందే. వారంరోజులుగా కురుస్తున్న వరుస వర్షాల నేపథ్యంలో నగర రోడ్లపై అడుగో మడుగు, గుంతలు భయంకరంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటిని వెంటనే పూడ్చేయాల్సి ఉన్నా ఆ పనుల జాడ లేదు. ఈ నేపథ్యంలో సీఆర్ఎంపీ రోడ్ల పర్యవేక్షణ బాధ్యతలను అడిషనల్ కమిషనర్లకు అప్పగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. తమకు కేటాయించిన సీఆర్ఎంపీ రోడ్లను ప్రతిరోజు ఉదయం ఒక పర్యాయం పరిశీలించాలి. ఎక్కడ లోపాలున్నా వెంటనే మరమ్మతు చేయించాలి. పారిశుధ్యం, పచ్చదనం, లేన్‌మార్కింగ్ వంటివి సవ్యంగా ఉండేవిధంగా చూడాలి. వారితో పాటు సంబంధిత ఎస్ఈ, ఈఈలు యథావిధిగా వాటికి సంబంధించిన తమ బాధ్యతలు నిర్వహించాలి. నగరవ్యాప్తంగా ఆయా జోన్లలో మొత్తం 2,256 గుంతలు ఉన్నట్లుగా అంచనా.

విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు హర్షణీయం

శంషాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా విశ్వవిద్యాలయానికి సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరు పెట్టడం హర్షణీయమని రాజేంద్రనగర్, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ఊరచెరువు వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద రజకసంఘం నాయకుడు, కౌన్సిలర్ కుమార్ ఏర్పాటు చేసిన ఐలమ్మ 129వ జయంతి వేడుకల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్, మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా, మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు, రజకసంఘం నేతలు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవుల మృతి


ఆవు కళేబరాల వద్ద రోదిస్తున్న లింగంయాదవ్

షాద్‌నగర్‌రూరల్: విద్యుదాఘాతంతో రెండు పాడి ఆవులు మృతి చెందాయి. ఈ సంఘటన గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని రంగంపల్లి గ్రామానికి చెందిన జావాజి లింగంయాదవ్, అఖిల దంపతులు. వారికి గ్రామంలో ఉన్న కొద్దిపాటి పొలాన్ని విక్రయించి ఇటీవల రెండు జెర్సీ పాడి ఆవులను కొనుగోలు చేశారు. పాడి పోషణ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆవులు మేత వేస్తుండగా .. ఒక్కసారిగా హైటెన్షన్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో ఆవులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న లింగయ్య దంపతులు ఘటనా స్థలికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు దంపతులు కోరుతున్నారు.

గంజాయి సేవిస్తున్న యువకులకు రిమాండ్


పోలీసుల అదుపులో పట్టుబడిన యువకులు

ఇబ్రహీంపట్నం: గంజాయి సేవిస్తూ పట్టుబడిన ముగ్గురు యువకులను బుధవారం రాత్రి ఇబ్రహీంపట్నం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారంపట్టణంలోని త్రిశక్తినగర్ కాలనీకి చెందిన బోళ్ల వంశీధర్(25), ఖానాపూర్‌కు చెందిన చెరుకుపల్లి కృపాకర్ రెడ్డి(24), ఇబ్రహీంపట్నంకు చెందిన పగడాల నితిన్‌సాయి(24) చిన్ననాటి స్నేహితులు.. వ్యసనాలకు బానిసలైన వీరు సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయి విక్రేతలుగా మారారు. నగరంలోని ధూల్‌పేట నుంచి గంజాయి తీసుకువచ్చి ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లోని కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నారు. వీరికి కూడా గంజాయి సేవించే అలవాటుంది. ఈ క్రమంలో వంశీధర్‌కు చెందిన పాత ఇంట్లో గంజాయి సేవిస్తుండగా విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి పట్టుకొన్నారు. వారి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

రాజేంద్రనగర్: లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.8 వేల జరిమానా విధిస్తూ రాజేంద్రనగర్ అడిషనల్ డిస్ట్రిక్ట్ స్పెషల్ జడ్జి గురువారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. నేపాల్‌కు చెందిన వినోద్ కుమార్ నగరానికి వలసవచ్చి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌జీకే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతడి బంధువు కుటుంబం బాచుపల్లిలో నివాసం ఉండేది. బంధువు మృతి చెందడంతో అతడి భార్య, కుమార్తెను వినోద్ కుమార్ ఆర్‌జీకే ప్రాంతానికి తీసుకొచ్చాడు. బంధువు కుమార్తెపై కన్నేసిన వినోద్ కుమార్ పలుమార్లు ఆమెపై లైంగిక దాడికి పాల్పడటంతో గర్భవతి అయ్యింది. దీనిని గుర్తించిన ఆమె తల్లి నిలదీయగా అసలు విషయం చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసును విచారించిన రాజేంద్రనగర్ ఫోక్సో కోర్టు అడిషనల్ డిస్ట్రిక్ట్ స్పెషల్ జడ్జి ఆంజనేయులు నిందితునికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.8 వేల జరిమానా విధిస్తూ గురువారంతీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.7 లక్షల నష్ట పరిహారాన్ని అందించాలని ప్రభుత్వానికి సూచించారు.

పరారీలో హర్షసాయి

మణికొండ: ఓ యువతిపై లైంగికదాడికి పాల్పడటం, ఆమె వద్ద రూ. 2 కోట్ల డబ్బు తీసుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ హర్షసాయి పరారీలో ఉన్నాడు. అతడితో పాటు అతని తండ్రి రాధాకృష్ణ పైన బాధితురాలు నార్సింగి ఠాణాలో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఆధారాలు, స్టేట్ మెంట్ నమోదు చేసుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేసేందుకు అతని ఇంటికి వెళ్లగా అక్కడ ఎవరూ లేక పోవటంతో వెనుదిరిగారు. అతను ఏపీలో ఉన్నట్లు తెలియడంతో మూడు ప్రత్యేక బృందాలు అక్కడికి వెళ్లినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా గురువారం ఉదయం నుంచి కేసును ఉపసంహరించుకోవాలని, లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హర్షసాయి బాధితురాలిని ఈ మెయిల్ ద్వారా వేధించినట్లు సమాచారం. దీంతో బాధితురాలు తన న్యాయవాదితో కలిసి నార్సింగి పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీసులు ధృవీకరించలేదు.